సాక్షి శ్రీకాకుళం

గురువారం । 24 । జూలై । 2025



'ఇన్‌స్పైర్' చేద్దాం రండి..!

ఇన్‌స్పైర్ మనాక్ పేరిట సైన్స్ పోటీలకు రంగం సిద్ధమైంది. 6 నుంచి 12వ తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చు. - 8లో



గంజాయి రవాణా గుట్టురట్టు

ఇచ్ఛాపురం, టెక్కలిలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న పలువురిని పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. - 8లో

కుల ధ్రువీకరణపత్రం అవసరం లేదు

నరుబుజ్జిలి: వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని ప్రిన్సిపాల్ జి.బేతన సామి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29 వరకు గడువు ఉందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

బ్యాంకులు నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం నుంచి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వార్షిక క్రెడిట్ ప్లాన్ 2024-25, ఎంఎస్‌ఎంఈ, విద్యా రుణాలు, వ్యవసాయానికి క్రెడిట్, చెల్లింపులు, స్వయం సహాయక సంఘాల గ్రూపులకు లింకేజీ, ఎంసీపీ డిజిటల్, పీఎం సూర్యఘర్, పీఎం విశ్వకర్మ, నాబార్డు తదితర రుణాలపై బ్యాంకర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ, మత్స్య శాఖ, ఉద్యానవన శాఖ, తదితర శాఖల లక్ష్యాలపై ఆరా తీశారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను బ్యాంకర్లంతా అమలు చేయాలని సూచించారు. నాబార్డు డీసీ ఎం.రమేష్ కృష్ణ మాట్లాడుతూ కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్త ఉండేలా బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. సమావేశంలో యూబీఐ ప్రాంతీయ అధిపతి పి.రాజ, లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, డీసీసీబీ జనరల్ మేనేజర్ వరప్రసాద్, ఉద్యానవన శాఖ ఏడీ ప్రసాదరావు, నాబార్డ్ మేనేజర్ రమేష్‌కృష్ణ, మత్స్య శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ, ఏపీఎంఐపీ డీడీ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి త్రినాథస్వామి, ఆయా బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ

శ్రీకాకుళం క్రైమ్ : అవగాహన, అప్రమత్తతతోనే నేరాలను నియంత్రించవచ్చని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి దశలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, మహిళా చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. శక్తియాప్ ఆవశ్యకత, గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్, బాల్యవివాహాల నియంత్రణపై అధికారులు సమీప విద్యాసంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098, సైబర్ టోల్‌ఫ్రీ నంబర్ 1930, డయల్ 112 నంబర్లు గుర్తుపెట్టుకుని ఆపద సమయంలో వినియోగించాలన్నారు.

శాకంబరిగా మహాలక్ష్మి



బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో మహాలక్ష్మీ అమ్మవారిని ఆషాఢ మాసం, మాస శివరాత్రి పురస్కరించుకుని బుధవారం శాకంబరిగా అలంకరించారు. అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

స్మార్ట్ మీటర్లపై అపోహలొద్దు

శ్రీకాకుళం అర్బన్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలు అవసరం లేదని, వీటి వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ ఎస్.కృష్ణమూర్తి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్‌ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాలలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రారంభించిందని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుల విషయంలోనూ ఎటువంటి అపోహలు వద్దన్నారు. ఏవైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

హామీల డాబు మోసాల బాబు!

వీడియోల కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



రావు.. రావు.. పథకాలు... ఆశించకండి పథకాలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ ఎలక్షన్లో నవరత్నాలని వాగ్దానం ఇచ్చారు. దాని ప్రకారం అమ్మ ఒడి, రైతు భరోసా, స్కాలర్‌షిప్‌తో మిగతా నవరత్నాలన్ని పూర్తిగా కంప్లీట్ చేస్తే అతను ఈ ఎలక్షన్లో మంచికో, చెడుకో దిగిపోయారు. కానీ, ఒకటి కూడా బాకీ పెట్టలేదు. అతను పెట్టింది కంపల్సరీగా డేట్ బై డేట్ అక్కడ బటన్ నొక్కారు. ఇక్కడ డబ్బులు పడిపోయేవి. ఇదే వాగ్దానాలు చంద్రబాబు కూడా ఇచ్చాడు. ఇందులో రెండు కూడా కంప్లీట్‌గా ఇవ్వలేదు. దాని బట్టి చూస్తే ఇతను ఇవ్వరనే అర్థమవుతుంది.

– సోంపేట మండలం పాలవలసలో జరిగిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఓ వృద్ధురాలు అన్న మాటలివి. ఆ మాటలు అనడమే కాదు 'రావు రావు పథకాలు రావండి... ఇక రావండి... మరి ఆశించకండి ' అంటూ పాట ఎత్తుకున్నారు. ఆమె వాస్తవాలు చెప్పిందని చుట్టు పక్కల మహిళలు చప్పట్లతో హర్షాతిరేకాలు తెలియజేశారు.

మాకేటీ ఇవ్వడం లేదు



టీడీపీ ప్రభుత్వం వచ్చినా మాకేటీ ఇవ్వలేదు. ఓట్లన్నీ కాల్చేసినాడు. కాల్చేసి గెలిచినాడు. మాకు అన్నిటికి దిబ్బ చేసినాడు. మాకు ఈ బాధలు పెడతాడా.. గ్యాస్‌కు డబ్బులు లేవు. ఉపాధి పని డబ్బులు లేవు. రైతులకు డబ్బులు లేవు.. నానాటి ముసలోల్లకు పెన్షన్ ఇవ్వడం లేదు. మేము ఎలాగ బతుకుతాము. జగన్ బాబు ఉన్నప్పుడు బాగుండేది. గుండె మీద చెయ్యేసి చెబుతాం.. –టెక్కలి మండలం పిట్టల సరియా గ్రామంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం సందర్భంగా ఓ వృద్ధురాలు ఆవేదనతో చెప్పిన విషయాలివి.

బతుకులు రోడ్డుపాలు



జగనన్న ఉన్నప్పుడు సాయం చేశాడు. అతని వలన బాగు పడ్డాం. ఇంటికే తెచ్చి ఇచ్చాడు. ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా ఆధారం లేదు. రూ.15వేలు.. రూ.50 వేలు లేదు. అది ఇది గ్యాస్ అన్నాడు. ఏదీ చేయలేదు. అంతా సొల్లే. ఎన్నికలప్పుడు ఇంటింటికీ వచ్చి జగన్‌మోహన్‌రెడ్డి కంటే అన్నీ ఎక్కువగా ఇస్తామని చెప్పి నమ్మించి ఓటేయించుకున్నారు. గెలిచిన తర్వాత ఒక్కడూ మా గడప తొక్కలేదు. చంద్రబాబు మా బతుకులు రోడ్డు పాలు చేశాడు. పథకాల కోసం ప్రశ్నిద్దామంటే ఏ టీడీపీ నాయకుడూ కన్పించడం లేదు. – శ్రీకాకుళం నగరంలో జరిగిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం సమయంలో కె.పద్మ అనే మహిళ చేసిన వ్యాఖ్యలివి.



- చంద్రబాబు నిర్వాకంపై తీవ్ర స్థాయిలో నిరసన
- హామీలిచ్చి మోసగించారని జనం మండిపాటు
- దాడులు, బెదిరింపులు ఉన్నా భయపడని వైనం
- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీలో ఎక్కడికక్కడ గుర్తు చేస్తున్న ప్రజలు
- సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో నిలదీత

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

చంద్రబాబు ఇచ్చిన హామీలు, చేసిన మోసాలపై జిల్లాలోని మహిళలతో పాటు అన్ని వర్గాల వారు మండిపడుతున్నారు. బాబు చేతిలో మరోసారి మోసపోయామని గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికలకు ముందు తమ ప్రాంతానికి వచ్చినప్పుడు 'నాకు ఆడబిడ్డలు లేరు.. మీరే నాకు ఆడబిడ్డలు. మహిళలను మహాశక్తిగా తీర్చిదిద్దే బాధ్యత నాది. మహిళలను మహారాణులను చేస్తాను. ప్రతీ మహిళకు నెలకు రూ.1500 అందిస్తాను. చదువుకున్న ప్రతీ బిడ్డకు తల్లికి వందనం కింద రూ.15వేలు వేస్తాను. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తాను. ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షల రుణాలు ఇస్తాను. అందరికీ రెండు సెంట్లు స్థలమిచ్చి, ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటాను. మహిళలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తాను. ప్రతి రైతుకు రూ.20వేల ఆర్థిక సాయం అందజేస్తాను. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కి ఇస్తాం. రాయితీపై ట్రాక్టర్లు, యాంత్రీకరణ పథకాన్ని అమలు చేస్తాను. ఏటా 4 లక్షలు చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఈ లోపు నిరుద్యోగ భృతికింద నెలకి రూ.3వేలు ఇస్తాను. ఉచిత ఇసుకతో నిర్మాణ రంగాన్ని నిలబెడతాం. వలంటీర్ల జీతాలు రూ.10వేలు చేస్తాం. ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌సీ ఇస్తాం..' ఇలా హామీలు గుప్పిస్తే ఆశపడి ఓటు వేశాం. తీరా గెలిపించాక మోసం చేశాడు అంటూ మహిళలు, రైతులు, నిరుద్యోగులు తీవ్ర స్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు.

కేసులకు బెదిరేది లేదు..

ఏడాది పాలన దగాపై వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటికి వెళ్తుంటే మహిళలు, రైతులు, వృద్ధులతో పాటు అన్ని వర్గాల వారు కూటమి ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తుతున్నారు. చంద్రబాబు హామీలను, మోసాలను నాయకులు గుర్తు చేయకుండానే ప్రజలే గుర్తు చేస్తూ బాధపడుతున్నారు. తప్పు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు కూటమి ప్రభుత్వం దాడులకు తెగబడుతున్నా.. అక్రమ కేసులు బనాయిస్తున్నా.. బెదరకుండా బాబు మోసాలపై గళమెత్తుతున్నారు. మోసం చేయడం ఆయనకు అలవాటు.. మోసం పోవడం మాకు అలవాటు అయిపోయిందన్నట్టుగా వాపోతున్నారు. మరోవైపు ఏడాది పాలనలో ఏదో చేసేసినట్టు టీడీపీ నాయకులు సుపరిపాలన తొలి అడుగు పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు పబ్లిక్‌గా నిలదీస్తున్నారు. మోసం చేశారని ఎమ్మెల్యేలనే ప్రశ్నిస్తున్నారు.

అంతా బోగస్..

'పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తాను. ఆమదాలవలస నియోజకవర్గంలో పురుషోత్తపురం వద్ద వంశధార నదిపై, ముద్దాడపేట వద్ద నాగావళి నదిపై వంతెనల నిర్మాణాలు పూర్తి చేస్తాం. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తాం. జీడి పిక్కల 80కిలోల బస్తా మద్దతు ధర రూ.16 వేలు చేస్తాం. వంశధార, నాగావళి నదులను అనుసంధానం చేస్తాం. పలాసలో డిఫెన్స్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తాం.

నరసన్నపేట పరిధిలో ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తాం. వంశధార- బాహుదా నదుల అనుసంధానం చేస్తాం. టెక్కలిలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తాం. బుడగట్లపాలెంలో మత్స్యకార జెట్టీ నిర్మిస్తాను...' ఇలా ఎన్నెన్నో చంద్రబాబు చెప్పినా ఒక్కటి కూడా చేయలేదని జనం గగ్గోలు పెడుతున్నారు. బోగస్ ప్రచారంతో మోసగిస్తున్నారని మండి పడుతున్నారు.

ఇసుక అక్రమార్కులపై చర్యలేవీ?

- కొత్తవలసలో అనధికార ఇసుక ర్యాంపు మూసివేయాలి
- బాధితులతో కలిసి అక్రమ తవ్వకాలను పరిశీలించిన మాజీ స్పీకర్ తమ్మినేని



గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: కొత్తవలస, పాతనిమ్మతొర్లువాడ, ముద్దాడపేట తదితర గ్రామాల పరిధిలో అనధికార ఇసుక ర్యాంపులను వెంటనే మూసివేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల పరిధిలో నాగావళి నదిలో నిర్వహిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలను బుధవారం పరిశీలించారు. పాతనిమ్మతొర్లువాడ గ్రామస్తులపై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదీగర్భంలో లోతుగా తవ్వకాలు చేపట్టడం దారుణమన్నారు. ఇలాంటి చర్యల వల్ల తాగునీటికి ముప్పు ఏర్పడుతుందన్నారు. అనధికార ర్యాంపుల వెనుక కూటమి పార్టీ ప్రముఖుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాత నిమ్మతొర్లువాడ శ్మశాన వాటిక, మైదానం సమీపంలో తవ్వకాలు అడ్డుకున్న గ్రామస్తులపై దాడులు జరగడం అమానుష చర్య అని, దాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇక్కడి ఇసుక మాఫియా సీఎం చంద్రబాబునాయుడికి సంబంధించినదిగా చెబుతున్నారని.. చంద్రబాబు ఇదేనా నీ సుపరిపాలన అని ప్రశ్నించారు. కలెక్టర్ పరిశీలించి తక్షణమే ఇసుక ర్యాంపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిల పక్షాల నేతలతో కలిసి ఉద్యమం చేపడతామని తమ్మినేని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ, రాష్ట్ర కళింగ కుల విభాగం అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, యువ నాయకులు తమ్మినేని చిరంజీవినాగ్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సర్పంచ్ సోమరాజు తేజ, నాయకులు ఎన్ని రామచంద్రయ్య, గురుగుబెల్లి అప్పలనాయుడు, బొడ్డేపల్లి మన్మధరావు, గొంటి కృష్ణ, బెండి జయరాం, తాండ్ర ధనుంజయరావు, మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్‌లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ యువజన విభాగం నాయకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తూకంలో తేడా వస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్‌వో సూర్యప్రకాశరావు

గార: నిత్యావసర సరుకుల తూకంలో తేడా వస్తే చర్యలు తప్పవని డీఎస్‌వో జి.సూర్యప్రకాశరావు హెచ్చరించారు. బుధవారం గార తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డిపో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఓ మాట్లాడుతూ ప్రతి డిపో వద్ద తప్పనిసరిగా బోర్డులు ఉండాలని, ధరలు, స్టాకు వివరాలు నమోదు చేయాలని సూచించారు. 26 నుంచి దివ్యాంగులకు, వృద్ధులకు ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేయాలన్నారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రెండు పూటలా డిపో వద్ద సరుకులు అందజేయాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ ఎం.చక్రవర్తి, సివిల్ సప్లయ్ డీటీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల కోసం కొట్లాట

- రొట్టవలస సచివాలయం వద్ద ఉద్రిక్తత
- సకాలంలో పంపిణీ చేయకపోవడంపై రైతుల ఆగ్రహం
- సరఫరా చేయకుండా చేతులెత్తేసిన అధికారులు



రొట్టవలస సచివాలయం ఇరుపక్షాల రైతుల కొట్లాట

నరుబుజ్జిలి : రొట్టవలస గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 245 బస్తాల ఎరువులు(యూరియా) పంపిణీ చేస్తామని అధికారులు చెప్పడంతో ఉదయం నుంచే రైతులు పాసుపుస్తకాలు పట్టుకొని సచివాలయం వద్దకు చేరుకున్నారు. గంటల తరబడి వేచి ఉన్నా పంపిణీ చేయకపోవడంతో రైతులతో కలిసి స్థానిక సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ భర్త, వైఎస్సార్‌సీపీ మండల బూత్ కమిటీ అధ్యక్షుడు మూడడ్ల రమణ అధికారులను ప్రశ్నించారు. ఎటువంటి వివక్ష లేకుండా రైతులందరికీ ఎరువులు పంపిణీ చేయాలని కోరారు. దీనిపై అక్కడే ఉన్న కొందరు అనధికార వ్యక్తులు స్పందిస్తూ 'మేమున్నది మీరు చెప్పినట్లు చేయడానికి కాదు.. మాకు నచ్చిన విధంగా మేం పంపిణీ చేస్తాం..' అని చెప్పడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడులు చేసుకున్నారు. అరుపులు, కేకలతో ఏం జరుగుందో తెలియక రైతులు పరుగులు తీశారు. ఇంతలో మరికొందరు గ్రామస్తులు కర్రలు పట్టుకొనిరావడంతో స్థానిక మహిళా పోలీసు నరుబుజ్జిలి స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సచివాలయానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు.

కానిస్టేబుల్ దురుసు ప్రవర్తన..

ఉద్రిక్తత నెలకొన్న సమయంలో ఓ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించడం విమర్శలకు తావిచ్చింది. సర్పంచ్ భర్తగా రైతులకు ఎరువులు ఇవ్వాలని అడిగేందుకే వచ్చామని, గొడవలు పడటానికి కాదని బూత్ కమిటీ అధ్యక్షుడు మూడడ్ల రమణ చెబుతుండగా కానిస్టేబుల్ అడ్డుతగిలారు. సర్పంచ్ భర్తవా అయితే ఏంటి అంటూ గద్దించడంతో మరోసారి రైతులు ఆందోళనకు దిగారు.



రమణతో వాగ్వాదానికి దిగుతున్న కానిస్టేబుల్

బ్లాక్‌మార్కెట్‌కు ఎరువులు....


సచివాలయానికి వస్తున్న ఎరువుల వాహనాన్ని ఆమదాలవలస మండలం జొన్నవలస వద్ద నిలిపి సుమారు 70 నుంచి 80 బస్తాలను బ్లాక్‌మార్కెట్‌కు తరలించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అందుకే ఎరువుల కొరత ఏర్పడిందని అంటున్నారు. మరోవైపు సచివాలయం బయటే కొంతమంది లిస్టులు తయారుచేసి ఎరువుల కోసం నగదు ముందుగానే వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నిలిచిన పంపిణీ...

కొట్లాట నేపథ్యంలో ఎరువుల పంపిణీ విషయంలో అధికారులు చేతులెత్తేశారు. దీంతో రొట్టవలస, సూర్యనారాయణపురం, అవతరాబాద్ గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

పచ్చని ఉద్దానాన్ని నాశనం చేయవద్దు

వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల సమయంలో కార్పొరేట్ కంపెనీలు ఇచ్చిన విరాళాలతో అధికారం చేపట్టిన నాయకులు అదే కార్పొరేట్ కంపెనీలకు పచ్చని ఉద్దాన ప్రాంతాన్ని తాకట్టు పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం ఎంత వరకు సమంజసమని రైతు సంఘ, వామపక్ష నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. గుణుపల్లిలో బుధవారం కార్గో ఎయిర్ పోర్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.



ఆందోళన చేస్తున్న పోరాట కమిటీ నాయకులు, రైతులు

చెంతనే పోలీసులు.. చింతలేని పేకాటరాయుళ్లు!



- పాతపట్నం పోలీసుస్టేషన్ సమీపంలో పేకాట
- శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు చేస్తే తప్ప బయటపడని పరిస్థితి
- కాశీబుగ్గ పోలీసులపై గతంలో తిరగబడిన వ్యక్తే కీలక నిర్వాహకుడు
- గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసే విషయంలో ఉదాసీనత
- ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేయడంతో యాక్ట్ నమోదు!
- పేకాట శిబిరాలకు అడ్డాగా మారిన పాతపట్నం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

పేకాట శిబిరాలకు పాతపట్నం కేంద్రంగా నడుస్తోంది. కొన్నాళ్లుగా పాతపట్నంలోనే కాకుండా సరిహద్దు ప్రాంతాల్లోనూ రోజూ రూ.లక్షల్లో గేమ్ జరుగుతోంది. అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో ఎస్పీ దృష్టికి వచ్చినట్టు సమాచారం.

- పాతపట్నం పోలీసుస్టేషన్ సమీపంలోని కోర్టు కూడలి వద్ద ఖాళీగా ఉన్న ఒక ఇంట్లో కొన్ని రోజులుగా పేకాట శిబిరం నడుస్తోంది. స్థానిక సీఐ గానీ, ఎస్‌ఐ గానీ చర్యలు తీసుకోలేదు. సమాచారం జిల్లా అధికారుల దృష్టికి వచ్చింది. శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఆ బాధ్యత అప్పగించారు. ఇంకేముంది నిఘా పెట్టి దాడులు చేశారు. ఈ నెల 19న చేసిన దాడుల్లో ఏడుగురు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.57,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. దొరికిన వారిలో కుమార్, శ్రీను కీలక వ్యక్తులు. వీరిలో కుమార్ అప్పట్లో కాశీబుగ్గ టౌన్ సీఐ సూర్యనారాయణ తన సిబ్బందితో కలిసి గురండిలో పేకాట శిబిరాల రైడ్‌కి వెళ్లగా.. ఒడిశా పరిధిలో దాడులు చేయడమేంటని ఏపీ పోలీసులపై తిరగబడ్డాడు. అలాంటి వ్యక్తి పాతపట్నం నడిబొడ్డున, పోలీసు స్టేషన్‌కు సమీపంలో పేకాట శిబిరాన్ని నడుపుతున్నాడంటే ఇక్కడి పోలీసుల ఉదాసీనత ఎలా ఉందో అర్థమవుతుంది.
- ఇదే పాతపట్నం సర్కిల్, పోలీసు స్టేషన్ పరిధిలోని కాగువాడ సమీపంలో మహేంద్ర తనయ నది పక్కన పంపుషెడ్ వద్ద కూడా పేకాట శిబిరం నడుస్తోంది. దీనిపైనా స్థానిక పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో ఈ నెల 18న శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.7,580 నగదు స్వాధీనం చేసుకున్నారు.

అప్పటికే పలు మార్లు శ్రీకాకుళం వన్‌టౌన్, టూటౌన్, జేఆర్‌పురం, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఆమదాలవలస సర్కిల్ అధికారులతో పాటు పాతపట్నం సర్కిల్ అధికారులకు కూడా పేకాట శిబిరాలపై అప్రమత్తం చేయడమే కాకుండా హెచ్చరికలు కూడా చేశారు. మీ పరిధిలో పేకాట శిబిరాలపై చర్యలు తీసుకోకపోతే నా స్టైల్‌లో దాడులు చేసి పట్టిస్తానని హెచ్చరించినట్టు కూడా తెలిసింది. అయినా పాతపట్నంలో తీరు మారలేదు.

ఉదాసీనత ఎందుకో?

టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న వ్యక్తులను స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగిస్తే.. వారిపై తొలుత సాధారణ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని, ఆ తర్వాత ఎస్పీ దృష్టికి వెళ్లడంతో ఆయన గట్టిగా హెచ్చరించడంతో గేమింగ్ యాక్ట్ కేసు నమోదు చేసినట్టు వాదనలు ఉన్నాయి. ముఖ్యంగా కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసే విషయంలో ఆచితూచి వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. పేకాట శిబిరాల నిర్వాహకుల నుంచి ప్రతి నెలా పెద్ద ఎత్తున ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీరి వెనక స్థానిక నేతల అండదండలు కూడా ఉన్నాయి. ఆ కారణం చేతనే పేకాట నిర్వాహకులు రెచ్చిపోయి శిబిరాలు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కారణమేదైనా పాతపట్నం పోలీసు స్టేషన్ సమీపంలోనే పేకాట శిబిరం నిర్వహిస్తూ ఉండటం, టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది.



పాతపట్నం పోలీసు స్టేషన్ సమీపంలో పేకాటరాయుళ్లు పట్టుబడిన ఇల్లు ఇదే (కర్టన్ వేసి ఉన్న ఇల్లు)

క్లుప్తంగా

28న మెగా జాబ్‌మేళా

పాతపట్నం/శ్రీకాకుళం పాతబస్టాండ్: పాతపట్నం ఆల్‌ఆంధ్రా రోడ్డు సమీపంలో ఉన్న మహేంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 28వ తేదీన ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ప్రీమియర్ ఇంజినీర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపిటోరియా, ముత్తూట్ గ్రూప్, అపోలో ఫార్మసిస్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 562 ఖాళీలకు నియమకాలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బి.ఫార్మసీ చదివిన యువతీ, యువకులు హాజరవ్వాలని సూచించారు. ముందుగా ఎన్‌ఏపీయూఎన్ వైఏఎం.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతలు కాపీలు, పాస్‌ఫోర్ట్ సైజు ఫొటోతో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 83176 52552, 83320 39243 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

హాల్ టికెట్ల విడుదల

శ్రీకాకుళం క్రైమ్ : ఏపీ పోలీస్ కానిస్టేబుల్ (మహిళా పీఎంటీ, మహిళా పీఈటీ) పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. అభ్యర్థులు తమ అడ్మిట్‌కార్డులను 'ఎస్‌ఎల్‌పిఆర్‌బి.ఎపి.జిఒవి.ఐఎన్' నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సంబంధిత బోర్డు బుధవారం ప్రకటన జారీ చేసింది.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పాతపట్నం: మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి ప్రలోభాలకు గురిచేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ టెక్కలి ఇన్‌చార్జి వెంకట అప్పారావు తెలిపారు. బుధవారం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలు వెల్లడించారు. పాతపట్నం మండలంలోని సీది గ్రామానికి చెందిన యువకుడు దాసరి నవీన్ అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో ప్రలోభాలకు గురిచేయడంతో జూన్ 9వ తేదీన బాలిక తల్లి ఎస్.లక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు బుధవారం దాసరి నవీన్‌పై పోక్సో కేసు నమోదు చేసి, పాతపట్నం కోర్టుకు హాజరుపరిచారు. దీంతో నిందితునికి రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

జిల్లాకు 10 మంది ప్రొబేషనరీ సివిల్ ఎస్‌ఐలు



ప్రొబేషనరీ సివిల్ ఎస్‌ఐలతో డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: విశాఖ రేంజి డీఐజీ కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న 10 మంది ప్రొబేషనరీ సివిల్ ఎస్‌ఐలు ఐదు నెలల పాటు జిల్లాలో ఆచరణాత్మక శిక్షణ పొందేందుకు రానున్నారు. వీరంతా బుధవారం రేంజి కార్యాలయంలో డీఐజీ గోపినాథ్ జెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, నేర పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, సాధన, ఎదుర్కొనే సవాళ్లపై అవగాహన అవసరమన్నారు. పోలీస్‌స్టేషన్లలో విధులు, రికార్డులు, స్థానిక చట్టాలు, భౌగోళిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వారితో పాటు ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్‌జిందాల్, అమిత్‌బర్దార్, మాధవరెడ్డి ఉన్నారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

ఎచ్చెర్ల: మండలంలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన సీపాన చలపతిరావు (29) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

చలపతిరావు మంగళవారం జర్జాం గ్రామ సమీపంలోని ఒక లే అవుట్‌లో అపస్మారక స్థితిలో పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించి లే అవుట్‌లో ఉండడంతో ఇంటికి తీసుకొని వచ్చారు. అనంతరం సపర్యలు చేసి మంగళవారం రాత్రి పడుకొనిబెట్టారు. అయితే బుధవారం ఉదయం సరికి అతడు నోటినుంచి నురగ కక్కుతూ మృతి చెందాడు. తండ్రి అనంతప్రసాద్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని రిమ్స్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

ఇళ్లలోకి చేరిన బురద నీరు



ఇంట్లోకి వస్తున్న నీటిని తోడుతున్న వ్యక్తి

కంచిలి: మండల కేంద్రం కంచిలితోపాటు పలు గ్రామాల్లో బుధవారం కురిసిన కుండపోత వర్షానికి పలు ఇళ్లలోకి బురద నీరు చేరింది. దీంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా బలియాపుట్టుగ కాలనీలో వర్షం కురవగానే ఇళ్లలోని వరద నీరు చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. కాలనీకి ఎగువన ఉన్నటువంటి జెడ్పీ హైస్కూల్ నుంచి వచ్చిన నీరు ఇళ్లలోకి చేరుతుండడంతో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. అనేకమార్లు పంచాయతీ సర్పంచ్‌కు పరిస్థితి విన్నవించుకున్నప్పటికీ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తక్షణమే కాలనీలో ఉన్న వీధులకు డ్రైనేజీ సౌకర్యం కల్పించి ఇళ్లలోకి వర్షపు నీరు రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బాల శాస్త్రవేత్తలూ... ఇన్‌స్పైర్ చేద్దాం రండి..!



- పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టుల రూపకల్పనకు అవకాశం
- ప్రతిఏటా ఇన్‌స్పైర్ మనాక్ పేరిట సైన్స్ పోటీలు
- 6 నుంచి 12వ తరగతుల విద్యార్థులు పోటీల్లో పాల్గొనే ఛాన్స్
- ఐదు ప్రధాన అంశాలతో ప్రాజెక్టుల రూపకల్పన
- సెప్టెంబర్ 15 వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు



జాతీయ పోటీలకు ఎంపికైన సంతబొమ్మాళి విద్యార్థులతో అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

పిల్లల్లో ప్రాథమిక దశలోనే వినూత్న ఆలోచనలకు అవకాశం లభిస్తోంది. విద్యార్థుల్లో దాగి ఉన్న సజనాత్మకతను వెలికి తీసేందుకు ఇన్‌స్పైర్ మనాక్ వేదికగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏటా ఇన్‌స్పైర్ మనాక్(మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్) అవార్డ్స్ పేరిట విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తోంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం 2025–2026 విద్యా సంవత్సరానికిగాను ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పేరిట నిర్వహించనున్న పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సెప్టెంబర్ 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు విధించారు. విద్యార్థులు రూపొందించే తమ ప్రాజెక్టు నమూనా, ఇతర వివరాలను ఇన్‌స్పైర్ అవార్డ్స్ - డీఎస్టీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. రోజువారి సమస్యలకు, సామాజిక సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు చక్కటి ఆలోచనతో డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ అవార్డు మనాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. వీటిల్లో ఎంపిక చేసిన ప్రాజెక్టుకు రూ.10 వేలు చొప్పున విద్యార్థి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. ఈ డబ్బులతో ఉపాధ్యాయుడు సహకారంతో విద్యార్థి ప్రాజెక్టును సిద్ధం చేసి జిల్లా ప్రదర్శనకు రావాల్సి ఉంటుంది.

ఇదివరకు నామినేషన్ల వివరాలు

ఏడాది	నామినేషన్లు	జిల్లాస్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు
2018–19	1,470	71
2019–20	1,812	483
2020–21	1,730	263
2021–22	1,762	257
2022–23	1,678	207
2023–24	2,263	326
2024–25	2,127	167
2025–26	రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు	

పెండింగ్ నిధులేవి..?

గతేడాదికి సంబంధించి విద్యార్థుల ప్రాజెక్టుల రూపకల్పన ఆర్థిక లబ్ధిని ప్రభుత్వం జమ చేయలేదని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10 వేలు సాయం చెల్లిస్తుంటారు. 2022–23 వరకు బాగానే చెల్లించారు. 2023–24కు సంబంధించి విద్యార్థులకు లబ్ధి అందజేయడంలో ప్రభుత్వం, అధికారులు తాత్సారం చేస్తున్నారు. రెండేళ్లగా 493 ప్రాజెక్టులకుగాను 300 మందికిపైగా ప్రాజెక్టుల విద్యార్థులకు లబ్ధి జమ కాలేదని తెలుస్తోంది. ప్రభుత్వాలు ఇలా చేస్తుంటే విద్యార్థులకు ఆసక్తి ఏవిధంగా వస్తుందని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.



ప్రాజెక్టు రూపకల్పనను వివరిస్తున్న విద్యార్థులు (ఫైల్)

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పరిధిలో 3,017 పాఠశాలలు ఉండగా, 2.64లక్షల మంది మంది చదువుతున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో 1,62,151 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 1,02,010 మంది చదువుతున్నారు. ఇంటర్ కోర్సులను అందిస్తున్న 165 కాలేజీల్లో.. సీబీఎస్సీతో కలిసి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు మరో 40 వేల మంది ఉన్నారు.

2 వేలకుపైగా ప్రాజెక్టులు లక్ష్యంగా..

జిల్లావ్యాప్తంగా 2 వేలకుపైగా ప్రాజెక్టు నమూనాల నామినేషన్ల స్వీకరణ లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఐదు ప్రధాన అంశాలపై ప్రాజెక్టుల రూపకల్పన చేపట్టనున్నారు. అందులో 1.మేక్ ఇన్ ఇండియా, 2.స్కిల్ ఇండియా, 3.స్వచ్ఛ భారత్, 4.స్వాస్థ(ఆరోగ్య) భారత్, 5.ఏదైనా సరికొత్త ఇన్నోవేటివ్ ప్రాజెక్టులను రూపొందించాలని నిర్ణయించారు. ప్రతి పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు తగ్గకుండా దరఖాస్తు చేసేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

దరఖాస్తు ఎలా చేయాలి

- తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి.
- స్థానిక అంశాలపై తొలుత డిజైన్ చేసి మెప్పించగలగాలి.
- ఈ విద్యాసంవత్సరంలో ప్రధానంగా ఐదు ప్రధానాంశాలపై ప్రాజెక్టులను రూపొందించేలా చర్యలు చేపట్టాలి.
- తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి అందుకు అవసరమైన ప్రాజెక్టు రూపొందించాలి.
- విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి, విద్యార్థి బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు నంబర్ ఎంటర్ చేయాలి.
- ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రాజెక్టు ఎంపిక: రెండు నెలల్లో పూర్తిచేసి జిల్లాస్థాయి పోటీల ప్రదర్శన చేపడతారు. ప్రధానమైనవాటి ప్రదర్శనకు అనుమతిస్తారు.
- జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టుకు ప్రయోగం నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేల నగదు జమ చేస్తారు.

చక్కటి అవకాశం



ప్రతిభ ఉన్నటువంటి విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు చక్కటి అవకాశం. ప్రాజెక్టులు తయారు చేసేలా విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. జిల్లాలో 2 వేలకు పైగా నామినేషన్లను చేయించేలా టార్గెట్ పెట్టుకున్నాం. పాఠశాల స్థాయిలో రూపొందించిన ప్రాజెక్టుల నుంచి ఎన్ఐఎఫ్ వారు కొన్నింటిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. గత రెండేళ్లగా ప్రాజెక్టుల రూపకల్పన తయారీ నిధులు తమకు రాలేదని విద్యార్థులు అడుగుతున్నారు. వారికి ఏమని సమాధానం చెప్పాలో తెలియడం లేదు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– ఎన్.కుమారస్వామి, జిల్లా సైన్స్ అధికారి, శ్రీకాకుళం

ప్రత్యేక చొరవ తీసుకోవాలి



సైన్స్ ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి ఉత్తమ ప్రాజెక్టులు ఆవిష్కృతం చేయాలి. ప్రాజెక్టుల రూప కల్పనపై సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఇన్నోవేటివ్‌గా రూపొందించాలి. ప్రతీ పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి ఆ నమూనాలను వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ముఖ్యంగా ప్రతీ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి. అన్ని విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్/హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

పిడుగు పడి రైతు మృతి



వీరాస్వామి మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలంలోని దుప్పిలపాడు గ్రామంలో బుధవారం పిడుగు పడి అదే గ్రామానికి చెందిన బొక్కరి వీరాస్వామి(42) అనే రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు వీరాస్వామి గ్రామ సమీపంలో ఉన్న తమ పొలానికి వెళ్లి గట్లు వేస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ వర్షంతో పాటుగా పిడుగు సమీపంలో పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శాంతికుమారి, పిల్లలు జశ్వంత్, జ్యోత్స్నలు ఉన్నారు. వీరాస్వామిది సంతబొమ్మాళి మండలం కొల్లిపాడు గ్రామం కాగా, గత కొన్నేళ్లుగా భార్య పిల్లలతో కలిసి అత్తవారి గ్రామమైన దుప్పిలపాడు గ్రామంలో ఉంటున్నాడు. ఆయన మృతితో రెండు గ్రామాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల సమాచారం మేరకు వీఆర్వో అఖిల్ శవ పంచనామ నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పడవ బోల్తాపడి మత్స్యకారుడు మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గార: మండలంలోని బందరువానిపేట తీరంలో పడవ బోల్తా పడడంతో మత్స్యకారుడు బడి గజేంద్ర (54)మృతి చెందాడు. మత్స్యకారులు, పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. పుక్కళ్ల కృష్ణకు చెందిన బోటులో ఐదుగురు మత్స్యకారులు బుధవారం వేకువజామున వేటకు వెళ్లారు. మరలా సుమారు ఉదయం 10 గంటల ప్రాంతంలో తిరుగు ప్రయాణంలో రాకాసి అలల ఉద్ధృతికి పడవ బోల్తా పడడంతో గజేంద్ర మృతి చెందాడు. కొద్దిసేపటి తర్వాత మృతదేహం ఒడ్డుకు చేరుకుంది. మృతదేహం చూసి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. పడవ బోల్తా పడడంతో సుమారు రూ. 3 లక్షలు ఆస్తినష్టం జరిగింది. అలాగే గ్రామానికి చెందిన చోడిపిల్లి సూర్యం పడవ కూడా బోల్తాపడిన ఘటనలో వాళ్లకు కూడా దాదాపు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగింది. మృతుడు గజేంద్రకు ముగ్గురు అమ్మాయిలు, ఒక దివ్యాంగుడైన కుమారుడు ఉన్నారు. ఎస్‌ఐ సీహెచ్ గంగరాజు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. భార్య పోలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏపీవో చిన్నబాబు

మెళియాపుట్టి: ఆశ్రమ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా చూడాలని సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు స్పష్టం చేశారు. మండలంలోని పెద్దలక్ష్మీపురం గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహం పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే పరిసరాలు బాగు చేయాలన్నారు. వసతి గృహంలో తాగునీటి పథకం, వసతి గదులు, మరుగుదొడ్లు, స్టోర్, వంటశాల ఇతరత్రా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం ఉందా లేదా అని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కొంతమంది విద్యార్థులతో మాట్లాడి ఏవైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు చిన్నపాటి సమస్యలు వచ్చినా పీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షలు చేయించి బాధ్యతగా వ్యవహరించాలని హెచ్‌ఎం మురళీకి సూచించారు. పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

శ్రీకాకుళం అర్బన్:



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

వాతావరణంలో మార్పుల కారణంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత సూచించారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని అన్నారు. నీటి ద్వారా, కలుషిత ఆహారం ద్వారా అధికంగా వ్యాధులు ప్రబలతాయని హెచ్చరించారు. తాగునీటి ట్యాంకులు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో తాగునీటి పరీక్షలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. జనవరి నుంచి మలేరియా, డెంగీ, చికిన్ గున్యా వంటి కేసులు కొద్దిపాటి లక్షణాలతో నమోదైనప్పటికీ తొందరగా రోగులకు కోలుకున్నట్లు తెలిపారు. పక్క రాష్ట్రమైన ఒడిశా నుండి వచ్చిన రోగుల వలన కంచిలి ప్రాంతాల్లో మలేరియా కేసులు వ్యాప్తిచెంది 24 కేసులు నమోదైనట్లు వివరించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామదాసు, స్టాటిస్టికల్ అధికారి రామనాగేశ్వరరావు, పరిపాలనాధికారి బాబూరావు, డిప్యూటీ డెమో అధికారి ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల రక్తదాన శిబిరం రేపు



శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం కల్చరల్: దేశానికి సేవ చేయడంతో పాటు సమాజ సేవలో సైతం ముందుంటామని నిరూపిస్తున్నారు మాజీ సైనికులు. జిల్లా మాజీ సైనిక సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో కార్గిల్ విజయ దివాస్‌ను పురస్కరించుకుని జూలై 25వ తేదీన మహా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయం పెద్దరెల్లివీధి వద్ద శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అలాగే జూలై 26వ తేదీన జిల్లా మాజీ సైనిక సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో కార్యేషు ఈవెంట్స్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని వెంకోజీపాలెంలోని చందన మోహనరావు ఫంక్షన్ హాల్‌లో మా క్షేమం.. మీ త్యాగం.. మా ధైర్యం అనే నినాదంతో శ్రావణ సఖి 4వ ఎడిషన్ నిర్వహిస్తామన్నారు. దీనిలో భాగంగా వీర మాతలు, వీర నారీమణులకు ఘనంగా సత్కార్యం చేసి, చెరో రూ.10 వేల చొప్పున ఆర్థిక లబ్ధి అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94394 56757 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

రణస్థలం: ఎచ్చెర్ల మండలంలోని నవభారత్ కూడలి వద్ద జాతీయ రహదారిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రెండు పశువుల వ్యానులను బుధవారం పట్టుకున్నారు. వీటిలో తరలిస్తున్న 7 ఎద్దులు, 10 ఆవులను స్వాధీనం చేసుకుని గుర్ల గోశాలకు తరలించారు. ఈ పశువులను నారాయణ వలస సంత నుంచి అలమండ సంతకు తరలిస్తుండగా పట్టుకున్నారు. వ్యాన్ డ్రైవర్‌తో పాటు బాధ్యులపై ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో వరం కాలనీలోని ఒక గృహానికి ఆనుకొని ఉన్న పశువులశాలలో పేకాట ఆడుతూ నందా శ్యామ్‌ప్రసాద్, శిమ్మ రమణ అనే వ్యక్తులు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు బుధవారం పట్టుబడ్డారు. వెంటనే వీరిని రెండో పట్టణ పోలీసులకు అప్పగించారు. వీరి వద్ద నుంచి రూ.32,520లు నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు పేర్కొన్నారు.

27న జిల్లాస్థాయి చెస్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి అండర్–13 చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 27న నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బగాది కిషోర్, జామి రమేష్ బుధవారం తెలిపారు. శ్రీకాకుళం కొత్త రోడ్డు సమీపంలోని సీఎస్ఎన్ ట్రస్ట్ కార్యాలయంలో ఉదయం 9:30 గంటలకు ఎంపికలు మొదలవుతాయని పేర్కొన్నారు. 13 ఏళ్లలోపు బాలబాలికలు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఆగస్టు 2 నుంచి విజయవాడలో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి అండర్–13 చెస్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు పంపించనున్నట్లు ఆల్ ఇండియా చెస్ ఇన్ స్కూల్ కమిటీ సభ్యులు సనపల భీమారావు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9912559735 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గంజాయితో నలుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న టెక్కలి పోలీసులు

టెక్కలి రూరల్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకొని, వారి వద్ద నుంచి 4.75 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అక్రమంగా గంజాయి రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు టెక్కలి సీఐ తన సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై ఉన్న బీహార్ దాబా సమీపంలో బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సౌత్ 24 పరగణాల జిల్లా గొసాబా, పశ్చిమ ఆరంపూర్ గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు గోపాల్ సర్దార్, సుమన్ దాస్, మహాదేబ్ నాయక్, సుమన్ మండల్‌ల వాహనాలను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా గంజాయి పట్టుబడడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు బెంగళూర్ తీసుకొని వెళ్లి అక్కడ విక్రయాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడిన గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని జాజ్‌పూర్‌లో కొనుగోలు చేసినట్లు తెలిపారు.

10.26 కిలోలతో మరో వ్యక్తి అరెస్టు



నిందితుడిని విచారిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు 10.26 కిలోల గంజాయి తరలిస్తున్న ఒడిశాకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం తనిఖీలు జరుపుతుండగా దీపక్ కుమార్ నాయిక్ అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో తనిఖీ చేసినట్లు వెల్లడించారు. అతని వద్ద గంజాయి ఉండడంతో అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఒడిశాలోని బరంపురం నుంచి ఇచ్ఛాపురం వచ్చి ట్రైన్‌లో హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా గంజాయి స్వాధీనం చేసుకొని నిందుతుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

పాతపట్నం: ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా రెండో రోజు బుధవారం కూడా దాడులు నిర్వహించారు. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, పలాస మండలాలకు అనుకుని ఉన్న ఒడిశా గ్రామాలైన శిరడా, దిద్దినూగూడ, కొత్తగూడ పరిసరాల్లో 1,400 లీటర్ల నాటుసారా, 6,300 లీటర్ల తయారీకి సిద్ధంగా ఉంచిన పులియబెట్టిన బెల్లపు ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే భారీగా సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. సారా తయారీ, విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్లు మురళీ, రామచంద్ర కుమార్, ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న వ్యాక్సిన్ల కొరత



పిల్లలతో వ్యాక్సిన్ల కోసం ఎదురుచూస్తున్న తల్లులు

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో గత కొద్దిరోజులుగా చిన్నపిల్లలకు వేసే వ్యాక్సిన్ల కొరత వేధిస్తూనే ఉంది. ఎప్పటిలాగే బుధవారం తమ పిల్లలకు వ్యాక్సిన్లు వేయించేందుకు తీసుకొచ్చిన తల్లులకు ఈవారం సైతం కొన్ని వ్యాక్సిన్లు లేవనే సమాధానం రావడంతో ఇంటికి తిరుగుముఖం పట్టారు. టెక్కలి మండలం కె.కొత్తూరు పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బంది ప్రతీ బుధ, శనివారాల్లో చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తుంటారు. అయితే ప్రధానంగా ఐపీవీ, రోటా, డీపీటీ వ్యాక్సిన్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు వాపోతున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.